క్లుప్తంగా

'కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి'



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ నేతలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని పీసీసీ సభ్యుడు చెంచారావు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నేషనల్ హెరాల్డ్ విషయంలో కక్ష పూరితంగా ఏఐసీసీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జనగామ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం దిష్టి బొమ్మ దహనం చేసి శ్రీనివాస్‌రెడ్డి , మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఈడీ పేరుతో దేశంలోని అనేక పార్టీలను భయభ్రాంతులకు గురిచేసి బీజేపీ పబ్బం గడుపుకోవాలని చూస్తోందన్నారు. వెంటనే ఛార్జ్‌షీట్ నుంచి వారి పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, డాక్టర్ రాజమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్, మేడ శ్రీనివాస్, గాదెపాక రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

రమణ మృతి తీరని లోటు



రమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

జనగామ రూరల్: టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కందుకూరి రమణ మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఉమాపతి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ రాజు అధ్యక్షతన రమణ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ రమణ నిరంతరం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు బి.లక్ష్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంకుశావలీ, జిల్లా బాధ్యులు వజ్రయ్య, రాజేందర్ కుమార్, బానోత్ వెంకన్న, ప్రభాకర్, దూడల రమేష్, శ్రీనివాస్ వరప్రసాద్, గణేష్, రాజయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

దేవరుప్పుల: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మామిడాల యశస్విని‌రెడ్డి అన్నారు. అప్పిరెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూకట్ల సాయిలు ఇటీవల మృతి చెందాడు. కాగా, బుధవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్లా శ్రీరాములు, నాయకులు మాలతి, కూకట్ల కొమురయ్య, పులిగిల్ల మల్లయ్య, అనిల్, రామచంద్రునాయక్ పాల్గొన్నారు.

పరామర్శ

కొడకండ్ల: మండలంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పరామర్శించారు. నీలిబండతండాలో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకోగా మృతురాలి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన తండ విఘ్నేష్ కుటుంబసభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు.

27న కిశోర యోగా శిబిరం

పాలకుర్తి టౌన్: 8 నుంచి 15 సంవత్సరాలు నిండిన పిల్లలకు శ్రీ పరివార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిశోర యోగా సాధన శిబిరం ఈనెల 27వ తేదీ నుంచి 15రోజులు మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యాలయంలో నిర్వహించనున్నట్లు యోగా గురువు పెండిరాజు బాపూజీ ఒక ప్రటనలో తెలిపారు. చదివినది గుర్తు ఉండకపోడం, మానసిక, శారీరకంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు పోటీ ప్రపంచాన్ని తట్టుకొనేలా 15 రోజులు యోగా శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు.

వణికిస్తున్న వానరాలు

- రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

రఘునాథపల్లి: రఘునాథపల్లి రైల్వేస్టేషన్‌లో కోతుల బెడద తీవ్ర రూపం దాల్చింది. రైల్వే స్టేషన్ నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ కోతుల స్వైరవిహారం చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌పామ్‌లపై గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. బుకింగ్ కౌంటర్ వద్ద టికెట్లు తీసుకోవాలన్నా.. రైలు దిగి వెళ్లాలన్నా, రైలు కోసం ఎదురు చూడాలన్నా కోతులతో నానా ఇబ్బందులు పడుతున్నారు. కోతుల బెడద తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.



రఘునాథపల్లి రైల్వేస్టేషన్‌లో కోతుల స్వైరవిహారం

ప్రయాణికుల చేతిలో ఉన్న వాటిని లాక్కెళ్లడంతో పాటు అవి ఎక్కడ కరుస్తాయోనని భయ పడుతున్నారు. అధికారులు స్పందించి రైల్వే స్టేషన్‌లో కోతుల బెడద నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పోషకాహారంపై అవగాహన



జఫర్‌గఢ్: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ రాణి



చిల్పూరు: పోషణ పక్షోత్సవంలో దూలమ్మ

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహారంపై బుధవారం అవగాహన కల్పించారు. సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ పోషక విలువతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, రజితతో పాటు ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

చిల్పూరు: వెంకటాద్రిపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మి, స్వప్న, స్వజనేత పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండాలని అంగన్‌వాడీ టీచర్ మునిగాల రాణి అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోషకాహారంపై అవగాహన నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే బాలామృతం తదితర పౌష్టికాహారాలపై అవగాహన కల్పించారు. గోనెల గట్టమ్మ, మోహన్, సాంబరాజు, పూజిత పాల్గొన్నారు.

రఘునాథపల్లి: పోషకాలు కలిగిన పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. బుధవారం మండలంలోని జాఫర్‌గూడెం, వెల్ది అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార అవశ్యకతపై అవగాహన కల్పించారు. సెక్టార్ సూపర్‌వైజర్ సరస్వతి, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు రజిత, లావణ్య, యాదలక్ష్మి, రజిని పాల్గొన్నారు.

పాలకుర్తి/దేవరుప్పుల: బమ్మెర, కోల్కొండ, సింగరాజుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లీశ్వరి, శ్రీదేవి పాల్గొని గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



రఘునాథపల్లి: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కుమార్‌గౌడ్ తదితరులు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: ఈనెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సోమేశ్వ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, నాగిరెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పెంబర్తి మహిళా అధ్యక్షురాలు రేఖ కోరారు. ఈ మేరకు గ్రామంలో సభ వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం'

రఘునాథపల్లి: కాంగ్రెస్‌పై ప్రజలు విసుగు చెందారని,, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ వై.కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీతండా, రామచంద్రగూడెం, మాధారం, సోమయ్యకుంటతండా గామాల్లో పార్టీ కార్యకర్తలతో కలిసి ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. మండలంలోని ఇబ్రహీంపూర్‌లో బీఆర్ఎస్ గద్దెకు ఆయన పార్టీ శ్రేణులతో కలిసి భూమి పూజ చేశారు. గ్రామంలో విరాళాలు సేకరించి గద్దె నిర్మాణం చేపట్టిన పార్టీ నాయకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, గన్నోజు మదు, దామెర వెంకన్న, జోగు శ్రీకాంత్, కొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ పసునూరి మహేందర్‌రెడ్డి కోరారు. తిమ్మంపేట, ఉప్పుగల్లు, తమ్మడపల్లి (ఐ), కోనాయిచలం తదితర గ్రామాల్లో పార్టీ సమన్వయ కమిటీ సమావేశాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రజతోత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు మారపాక రవి, పార్టీ నాయకులు కడారి శంకర్, పెంతల రాజ్‌కుమార్, కొత్వాల కుమార్, ఎస్ శ్రీధర్, నాయిని నరేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో సిద్ధం కావాలి

దేవరుప్పుల: వేసవిలో ఆడుతూ పాడుతూ పై తరగతుల కోసం తమ తల్లిదండ్రుల పర్యవేక్షణలో ప్రణాళికతో సిద్ధం కావాలని ఫాదర్ జాన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాల యేసు ఇంగ్లిష్ మీడియం హై స్కూల్లో కరస్పాండెంట్ బ్రదర్ జేసుదాస్ అధ్యక్షతన జాయిస్ సమ్మర్ వెకేషన్ అనే ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ప్రాథమిక ఉన్నత విద్యార్థులకు పై తరగతుల కోసం దశ దిశ నిర్దేశం చేసి పలు సూచనలు చేశారు.



సమ్మర్ వెకేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

విద్యతోపాటు క్రీడా సంస్కృత వినోద కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కుంట రవి డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించకుండా, మూడు నెలలుగా వేతనాలు ఇవ్వక పోవడంపై ఈ నెల 14 నుంచి విధులు నిర్వహిస్తునే నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం మండలంలోని ఫీల్డ్‌అసిస్టెంట్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులును కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో కూలీలకు రోజు వారి వేతనం రూ.400 పెంచాలని, ఆర్థిక సంవత్సరంలో 150 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఎఫ్‌టిఈలుగా కన్వర్ట్ చేసి కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు, మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంపీడీఓకు వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి మంతపురి యాదగిరి, ఉపాధ్యక్షుడు రాజయ్య, గ్యార నాగరాజు, హేమలత, శేఖర్, మురళీధర్, ఆగయ్య, లక్ష్మి, సరిత, సత్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జఫర్‌గఢ్: ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీడీఓ సుమన్, తహసీల్దార్ శంకరయ్యకు వారు వినతిపత్రాలు అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు బానోత్ రవికుమార్, గుర్రాల అనిత, బాబు, రమేష్, హరిబాబు, ఏకనాథం, శ్రీనివాస్, నరేష్, శ్రీను పాల్గొన్నారు.



రఘునాథపల్లి: ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లు

పేస్కేలు అమలు చేయాలని వినతి

లింగాలఘణపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పేస్కేలు అమలు చేస్తూ వేతనాలు పెంచి ఎఫ్‌టీఈగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌లకు ఫీల్డ్‌అసిస్టెంట్లు వినతి పత్రాలు సమర్పించారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని పలు డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సారయ్య, యాకుబ్, వరలక్ష్మి, స్వరూప, యాదలక్ష్మి, ఉప్పలయ్య, రమేష్, మదార్, మహేష్, సిద్ధిరాజు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

దేవరుప్పుల: ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఫ్ఏల సంఘం మండల అధ్యక్షుడు రాగిపల్లి యాకయ్య కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ఆండాలుకు వినతిపత్రం అందజేచారు.



జఫర్‌గఢ్‌లో..



లింగాలఘణపురంలో..

కొడకండ్ల: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ నాగశేషాద్రిసూరికి తమ డిమాండ్‌లో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. సురేష్, సందుల వెంకన్న, మహేందర్, పూర్ణచందర్, హేమాని, మోతీరాం, సమ్మయ్య, కృపాచారి, ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పసికందు మృతి..!

- వైద్యుల నిర్లక్షమే నంటూ బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

పాలకుర్తి టౌన్: కడుపులోనే ఎసికందు చనిపోయిన సంఘటన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. బాధత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనారాయణపురం గ్రామానకి చెందిన యాట అర్చన మంగళవారం పురిటి నొప్పులతో పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు నార్మల్ డెలివరీ అవుతుందని అడ్మిట్ చేసుకున్నారు. బుధవారం సాయంత్రం వరకు కూడా డెలివరీ చేయకపోవడంతో బంధువులు సంబంధిత డాక్టర్లను నిలదీశారు. దీంతో వైద్యులు 'నచ్చిన చోటికి తీసుకెళ్లి డెలివరీ చేయించుకోండి' అంటూ సమాధానం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు అర్చనను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన డాక్టర్ హారిత.. కడుపులో బేబి చనిపోయిందని చెప్పి ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసి కందు మృతి చెందిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు అర్ధరాత్రి వరకు ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. బంధువులు, వివిధ పార్టీలు, ప్రజాసంఘల నాయకులు లోనికి చొచ్చుకెళ్లి డ్యూటీలో ఉన్న వైద్యులను, సిబ్బందిని నిలదీసే ప్రయత్నం చేశారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యాన పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట మృత శిశువుతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



బడిబాటలో పాల్గొన్న హెచ్‌ఎంలు

నర్మెట: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని హెచ్‌ఎంలు దూడల రమేష్, గంగరాజు కేశవరావు కోరారు. హన్మంతాపురం, మలక్పేట ప్రాథమిక పాఠశాలల పరిధిలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించిన వారు తల్లితండ్రులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, భోజనం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పలు స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌తో పాటు ప్రోత్సాహకాలు అందిస్తూ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్ పర్సన్ ఆశాలత, ఉపాధ్యాయులు విద్యావతి, గుర్రాల కరుణాకర్, ఆంజనేయులు, మధుసూదన్ , అంగన్‌వాడీ టీచర్స్ మమత తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: వేసవికాలంలో అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మన్ కె.లింగయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఫైర్‌స్టేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో వంటగ్యాస్‌తో జరిగే అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. గ్యాస్ సిలిండర్‌తో ప్రమాదవశాత్తు జరిగే అగ్నిప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. ఫైర్‌మన్ రవి, సిబ్బంది జె.ఇంద్రాసేనారెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన ఆర్టీఏ మెంబర్

జనగామ రూరల్: ఆర్టీఏ మెంబర్‌గా ఇటీవల నియమితులైన అభిగౌడ్ బుధవారం ఆర్డీఓ గోపిరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం, ప్రజలకి అందించాల్సిన సేవలపై చర్చించారు.

రిజర్వాయర్లను త్వరలో పూర్తి చేయిస్తా..

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి: పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి, మల్లంపల్లి, వావిలాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. రైతులను ప్రోత్సహించి ధాన్యం దిగుబడి పెంచడానికి సన్న వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తోందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మల్లంపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, చాకలి అయిలమ్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ బొబ్బాల అశోక్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరాచారి, సహకార బ్యాంకు ఎండీ సత్యనారాయణ రెడ్డి, ఏడీఏ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

రఘునాథపల్లి: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. బుధవారం ఖిలాషాపూర్, జాఫర్‌గూడెం, వెల్ది, రఘునాథపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహిన్సాముజ్జబ, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, జనగామ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు తోటకూరి రమేష్, బాషుమియా, కుమార్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం కందారి సారయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



పాలకుర్తి: మల్లంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

చిల్పూరు: రైతుల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. పల్లగుట్ట గ్రామంలో స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, ముగ్దుం, ఏఓ నజీరుద్దీన్, ఏఈవో నియ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలి

లింగాలఘణపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకొని గిట్టుబాటు ధర పొందాలని జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శివకుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రం, కుందారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, మార్కెట్ డైరెక్టర్లు మోహన్, శ్రీలతారెడ్డి, ఏఓ వెంకటేశ్వర్లు, సీఈఓ శ్రీనివాసు, ఏఈఓ స్పందన, మాజీ ఎంపీటీసీ బిక్షపతి, నాయకులు రాజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చంద్రయ్య, మల్లేశం, రాజశేఖర్ పాల్గొన్నారు.




రఘునాథపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రాంబాబు

రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

జఫర్‌గఢ్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య పేర్కొన్నారు. మండలంలోని తిమ్మంపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐలయ్య ప్రారంభించి మాట్లాడారు. సివిల్ సప్లై డీటీ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మంద మల్లేశం , ఏపీఎం రవీందర్, సీసీ శ్రీనివాస్, గ్రామైఖ్య సంఘం సభ్యులు కల్పన, రజిత, వాణి తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా ఉప్పల మల్లన్న జాతర



పూజ చేస్తున్న అర్చకులు

దేవరుప్పుల : మండల కేంద్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం పురస్కరించుకొని కొనసాగే ఉప్పలమల్లన్న జాతర బుధవారం వైభవంగా ప్రారంభమైంది. స్థానిక ఆలయ పూజారి పెద్దాపురం వెంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ శానకొండ శివ కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రారంభ ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం కొత్త వాడలో స్వామివారి శావను భక్తి ప్రపత్తులతో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద ధ్వజారోహణ, బసవ ముద్దతో జాతర ప్రారంభమైంది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఆయా సామాజిక వర్గాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చిల్పూరు: పల్లగుట్ట గ్రామానికి చెందిన దారం రామక్క బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ. 5వేలు పంపగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు అందజేశారు. రత్నాకర్‌రెడ్డి, అశోక్‌పాల్, దార రాజు, ఇసురం రాజు, శ్రీను ఉన్నారు.

ముళ్లపొదలను తొలగించాలని వినతి

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని కంచనపల్లి రోడ్డులోని శ్మశానవాటికలో సమాధులపై ముళ్లపొదలు అల్లుకు పోయాయని, జాతీయ ఉపాధిహామీ పథకంలో తొలగించాలని సామాజిక వేత్త బిర్రు సతీష్ బుధవారం ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ముళ్లపొదలు దట్టంగా పెరిగి సమాధులను పెకిలిస్తున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. వినతికి ఎంపీడీఓ సానుకూలంగా స్పందించారని సతీష్ తెలిపారు.



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న సతీష్

సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఛాగల్లులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి సముద్రాల రాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఛాగల్లు గ్రామంలో సీపీఐ గ్రామశాఖ మహాసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో పలు సమస్యలు నెలకొన్నాయని, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలోని మర్రికుంట నుంచి బొచ్కెరువు వరకు గల కట్టకాలువ పనులు చేపట్టాలని, పలు కాలనీలలో సీసీ రోడ్లు నిర్మించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూర్ల యాదగిరి, మహంకాళి నాగరాజు, తోట రమేష్, జీడి ఆశీర్వాదం, అజయ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.